

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం మండలంలోని కట్టుంగ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయనప్రారంభించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను వల్ల పంట నష్టం అధికంగా జరిగిందన్నారు. నియోజకవర్గంలో 6614 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారని అన్నారు. రైతులందరికీ న్యాయం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుల వద్ద నుంచి ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకోసం రూ.5వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం సమీకరించడం జరిగిందన్నారు. కొనుగోలు జరిగిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

- జిల్లాలో కేంద్ర బృందం పర్యటన
- నష్ట తీవ్రతను వివరించిన కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం, ఆలమూరు

మొంథా తుపాను కారణంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమలో జరిగిన పంట నష్టాన్ని మంగళవారం కేంద్ర బృందం పరిశీలించింది. ఇటీవల మొంథా తుపాను కారణంగా జరిగిన పంట నష్టంపై అగ్రికల్చరల్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్ను స్వామి, సిడబ్ల్యుసి డైరెక్టర్ శ్రీనివాసు బైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తిసింగ్, మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ మనోజ్కుమార్మీనా, విసిఅండ్ఎండి ఎస్.ఢిల్లీరావు, డైరెక్టర్ ఆఫ్రీసెర్చ్ ఎఎన్జిఆర్ఎయు పి.సత్యనారాయణ బృందం పర్యటించింది. కలెక్టర్ ఆర్.మహేష్కుమార్తో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించారు. మొంథా ప్రభావంతో జిల్లాలో జరిగిన వ్యవసాయ ఉద్యాన పంటలు దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ వ్యవస్థల నష్టాలపై రూపొందించిన నివేదికలు ఛాయాచిత్ర ప్రదర్శన ద్వారా వివరించడంతోపాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని కేంద్ర పంట నష్ట అంచనాల బృందానికి సమగ్రంగా వివరించి నష్టాల నివేదికలు అందించామని కలెక్టర్ మహేష్కుమార్ వెల్లడించారు. ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో వరి సాగు క్షేత్రాలు, ఎగ్జిబిషన్ కొత్తపేట మండలం కొత్తపేట గ్రామాలలో అరటి ఉద్యాన సాగు క్షేత్రాలలో కేంద్ర బృందం విస్తృతంగా పర్యటించి పంట నష్టాల పరిస్థితిని సమీక్షించారన్నారు. ప్రత్యక్షంగా తుపాను ప్రభావిత ప్రాంత నష్టాలు వ్యాప్తిని బృందం స్వయంగా పరిశీలించి నివేదిక ఆధారంగా నష్టపరిహారం సహాయ ప్యాకేజీ నిర్ణయిస్తారని తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో తీర ప్రాంతమైన కోనసీమ జిల్లాకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని అన్నారు. కేంద్ర బృందానికి జిల్లా వ్యా ప్తంగా 22 మండలాలలో జరిగిన నష్టాలను కలెక్టర్, ఏడు శాఖల అధికారులు



కొత్తపేట మండలంలో విరిగిపోయిన అరటి తోటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం



ఆలమూరు మండలం పెనికేరులో తుపాను ప్రభావంతో పాడైపోయిన వరి పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం. చిత్రంలో కలెక్టర్ మహేష్కుమార్

బృంద సభ్యులకు సమగ్రంగా వివరించారన్నారు. రైతుల ఆర్థిక ఆర్థిక పరిస్థితిని బట్టి అవసరమైన పరిహారాన్ని అందించే దిశగా కేంద్రానికి నివేదిస్తామని బృందం తెలిపిందన్నారు పంట నష్టానికి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని బృందం తెలిపిందన్నారు. తుపానుకు ముందు తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలు పునరావాస కేంద్రాలు తాత్కాలిక సహాయం ఉపశమన చర్యలను కలెక్టర్ బృంద సభ్యులకు విశదీకరించారు. జిల్లాలో చెట్టు పడి ఒక మహిళ చనిపోయారని తెలిపారు. వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగిందని, పంట కోత నూర్పుళ్ల దశలో తుపాన్లు రావడం రైతాంగానికి తీరని నష్టం వాటిలిందన్నారు. జిల్లాలో 1,60,000 ఎకరాలలో వరి సాగు చేపట్టగా వీటిలో 70 వేల ఎకరాలలో మొంథా తుపాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిలిందన్నారు. అదేవిధంగా అరటి తోటలు 2500 ఎకరా లలో దెబ్బతిన్నాయని అదే విధంగా కూరగాయలు తీగ జాతి పంటలు కూడా దెబ్బతి న్నాయని తెలిపారు. జియో కోఆర్డినేట్స్ తో సహా బృంద సభ్యులకు పంట నష్టాలను వివరించామన్నారు. వ్యవసాయ ఉద్యాన ఆర్అండ్బి, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యుఎస్, జాతీయ రహదారులు తదితర శాఖల కు జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు బృంద సభ్యులకు నివేది కలు ఛాయాచిత్రాల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించామన్నారు. ప్రతి ఏడాది తీర ప్రాంతంలో తుపాను చూపు తుందని అయినప్పటికి మొంథా తుపాను తీవ్ర ప్రభావాన్ని చూపిందన్నారు. కేంద్ర బృందం పంట నష్టాలపై సానుకూలంగా స్పందించిందని సాయంత్రం 4 గంటలకు సిఎంతో కేంద్ర బృందం మరొక్కసారి సమావేశమై నష్టాలపై సమీక్షించి తుది నివేదికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నదని కలెక్టర్ తెలిపారు. తుపాను నష్టాన్ని మదింపు వేయడానికి వచ్చిన బృందం జిల్లాకు విచ్చేయగా ముందుగా కలెక్టర్ మహేష్కుమార్ స్వాగతం పలికి జిల్లా స్థాయి అధికారులతో కలిసి నష్టాలు అంచనాలను నివేదించారు. కేంద్ర బృందంతో రైతులు మాట్లాడుతూ ధాన్యం ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వచ్చే వరి పంట, 20 బస్తాలు మాత్రమే అవుతున్నాయని భారీగా నష్టపోయామన్నారు. ప్రభుత్వం త్వరతగతిని ఆదుకొనేలా చర్యలు తీసుకోవాలని తమ రిప్రజెంటేషన్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, ఉద్యాన అధికారి బివి.రమణ, ఆర్డిఒ పి.శ్రీకర్, జిల్లా సహాయ వ్యవసాయ అధికారి ఎ.రాజశేఖర్, ఆర్అండ్బి పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యుఎస్ ఇంజినీర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా లో రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాని సిపిఎం డిమాండ్ చేసింది. జిల్లా వ్యాప్తంగా బాలికలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, కిడ్నాప్లు పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం అమలాపురంలో జరిగిన పదేళ్ల బాలిక కిడ్నాప్ ఉదంతం జిల్లా ప్రజలను తీవ్ర ఆందోళనలోకి నెట్టింది. జిల్లాలో ఇటీవల పెరిగిన నేరాల పట్ల సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోం ది. అమలాపురంలో కిడ్నాప్కు గురైన బాలికను పోలీసులు త్వరితగతిన ట్రేస్ చేసి, సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినందుకు సిపిఎం తరపున పోలీసు బృందాన్ని ఈ సందర్భంగా అభినందిస్తున్నా మని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు.

భద్రతా వైఫల్యంపై సిపిఎం ఆవేదన

అమలాపురం స్థానిక గొల్లగూడెంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్లు ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్నాయని అన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడంలో భద్రతా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. కిడ్నాప్ కేసులో నిందితుడు బాలికను తీసుకుని అమలాపురం నుంచి కాకినాడ, రామచంద్రాపురం, మండపేట, రావులపాలెం మీదుగా పి.గన్నవరం చేరుకునే వరకు, ఆయా మండలాల్లోని పోలీసు గస్తీ వ్యవస్థ విఫలమైందని స్పష్టంగా అర్థమవుతోందని ఆయన అన్నారు.

నిరంతరం గస్తీ నిర్వహించాలి

జిల్లాలో ముఖ్యంగా చెక్ పోస్టుల వద్ద, పాఠశాలలు, రద్దీగా ఉండే ప్రాంతాలలో గస్తీ కాసే పరిస్థితి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

లేకపోవడం పట్ల సిపిఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోందన్నారు. తక్షణమే అన్ని చెక్ పోస్టులలో ఒక సీనియర్ ఎస్ఐ స్థాయి అధికారితో నిరంతరం వాహనాలను తనిఖీ చేయాలని కారెం వెంకటేశ్వరరావు సూచించారు. నిరంతర గస్తీ నిర్వహించడం నేరాలను అదుపు చేయడంతో పాటు, ప్రమాదాలు చేసి పరారవుతున్న వాహనాలను కూడా పట్టుకు నేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. పగలు, రాత్రి వేళల్లో పోలీసుల పర్యవేక్షణ అవసరమైన అన్నిచోట్ల పెంచాలని అన్నారు. జిల్లాలో పెరుగు తున్న నేరాలను అదుపులోకి తీసుకురావడానికి, మహిళా భద్రతను పటిష్టం చేయడానికి ప్రభుత్వం పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చర్యలు కేవలం ప్రకటనలకే పరి మితం కాకుండా, నిరంతరం పనిచేసే వ్యవస్థగా ఉండాలని అన్నారు.

అవగాహనా కార్యక్రమాల విస్తరణ

సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాలికలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం కూడా దీనిని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి పూర్తిస్థాయి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని కారెం వెంకటేశ్వరరావు కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న రామచంద్రపురంలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎపిస్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15 న రామచంద్రపురం ఉపాధి భవన్ లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఉద్యోగ మేళా వివరాల పోస్టర్ను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంటర్వ్యూలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, ఫార్మసీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9948404165, 9988853335 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సెల్ ఫోన్లను బాధితులకు అందిస్తున్న సిఐ

బాధితులకు మొబైల్ ఫోన్లు అప్పగింత

ప్రజాశక్తి - రావులపాలెం


పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొంతకాలంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసిన పోలీసులు వాటిని అసలైన యజమానులకు తిరిగి అప్పగించారు. మంగళవారం పోలీస్స్టేషన్లో సిఐ శేఖర్ బాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్పి ఆదేశాల మేరకు సిబ్బందిని అప్రమత్తం చేసి టెక్నాలజీ ద్వారా ఇటీవల పోగుట్టుకున్న రూ. 4.20 లక్షల విలువ గల 11 మొబైల్ ఫోన్లను పట్టుకొని యజమానులకు అందజేశామన్నారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు కె.రమణారెడ్డి, జి.చంటి పాల్గొన్నారు.

విశ్వకర్మల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - అమలాపురం

విశ్వకర్మల సంక్షేమానికి కృషి చేస్తానని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ యువజన విభాగం అమలాపురం నియోజకవర్గ కన్వీనర్ గా వరద శ్రీను మంగళవరాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ విశ్వనాథుల పుష్పగిరి విశ్వకర్మ నియోజకవర్గ కన్వీనర్గా వరద శ్రీను ను నియమించారు.

కార్టూ'నిజం'



రహదారుల అభివృద్ధికి చర్యలు

- కొత్తపేట ఎంఎల్ఎ సత్యానందరావు
- రూ. 6.60 కోట్లతో రహదారుల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఆలమూరు

కూటమి ప్రభుత్వం రహదారుల అభివద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మండలంలోని నర్సిపూడి వద్ద రాష్ట్ర రహదారి అభివద్ధి నిధులు రూ. 3.85 కోట్లతో నూతనంగా నిర్మించనున్న నర్సిపూడి - వెదురుమూడి రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర రహదారి అభివృద్ధి నిధులు రూ. 2.75 కోట్లతో చేపట్టనున్న జొన్నాడ - మండపేట రహదారి మరమ్మతు పనులను కొత్తూరు సెంటర్లో ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలన అధికారంలోకి వచ్చాక గోతుల్లేని రహదారులే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతు పనులు నిర్వహించామన్నారు. అలాగే కొన్నింటికి నూతన రహదారుల నిర్మాణం చేపడు తున్నామని అన్నారు. మండలంలో రూ.6.60 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభి ంచడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్బి డిఇ వి.సూర్యనారాయణ, ఎఇ వెంకట రమణ, ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సొసైటీ ఛైర్మన్ రాయుడు బాబ్జి, డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, ఎంఎంసీ మాజీ ఛైర్మన్ దునే స్వామి నాయుడు, ఈదల నల్ల బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బండారు

'పది' పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల (ఎస్ఎస్సి 2026) ఫీజు చెల్లింపునకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పరీక్షల డైరెక్టరేట్ షెడ్యూల్ విడుదల చేసిందని డిఇఒ డాక్టర్ ఎస్కె సలీం బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు చెందిన రెగ్యులర్ విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా రూ.125 పరీక్ష ఫీజును నవంబర్ 13 నుంచి 25 లోపు చెల్లించవచ్చునని అన్నారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 3వ తేదీ లోపు చెల్లించవచ్చునని అన్నారు. రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 10వ తేదీ లోపు చెల్లించవచ్చని అన్నారు. రూ..500 అపరాధ రుసుముతో డిసెంబర్ 15వ తేదీ లోపు చెల్లించవచ్చ న్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు సబ్జెక్టులో వరకు రూ.110, వృత్తి విద్యా కోర్సులకు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఈ తేదీలలో ఏదైనా ప్రభుత్వ సెలవు దినాలు ఉంటే తదుపరి పని దినాన్ని గడువు తేదీగా పరిగణిస్తారని అన్నారు. విద్యార్థులు పరీక్ష ఫీజు ను %https://bse.ap.gov.in% స్కూల్ లాగిన్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఏదైనా సాంకేతిక లేదా పరిపాలన సందేహాల కోసం డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఇన్ఛార్జ్ బి.హనుమంత రావునిగానీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గానీ సంప్రదించాలని డిఇఒ తెలిపారు.

'ఎంఎస్ఎంఇ' పనులకు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తంలో ఏర్పాటుచేసిన సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) పార్కుల నిర్మాణ శంకుస్థాపన పనులను మంగళవారం సిఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఎంఎస్ఎంఇ ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణంలో భాగంగా స్థానికంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎంఎల్ ఎ అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆనందరావు మాట్లాడుతూ ఈ పార్కుల నిర్మాణంతో ఈ ప్రాంతంలో కొబ్బరి, కోకో, మత్స్య ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఎంపిటిసి సభ్యురాలు తాళ్ల లక్ష్మి నరసాయమ్మ, మాజీ జడ్పిటిసి మాజీ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆక్వా అథారిటీ కమిటీ డైరెక్టర్ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, డిసిఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఆర్డిఒ కె.మాధవి, ఎపి ఐఐసి, డిజెడ్ఎం, పద్మజ, డిఐఒ అరుణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి,డ్వామా ఎపిడి, డి.రాం బాబు, తహశీల్దార్ విఎస్. దివాకర్, ఎంపిడిఒ డి.కృష్ణ, డిప్యూటీ తహశీల్దర్ జి.లలిత, తదితరులు ఉన్నారు.



శంకుస్థాపనను ఎల్ఇడి ద్వారా వీక్షిస్తున్న ఎంఎల్ఎ, అధికారులు

పంచాయతీల పురోభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

నూరు శాతం పన్నులు వసూలుతో పంచాయతీల పురోభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి డి.శాంత లక్ష్మి అన్నారు. మండలంలోని చొప్పెల్ల పంచాయతీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యదర్శిని పంచాయతీకి సంబంధిత రికార్డులు, జరిగిన పనుల తీరు, శానిటేషన్, డ్రైయినేజీ క్లీనింగ్ వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థలో పనిచేసే సిబ్బంది విధులలో పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే వసూలు చేసిన పన్నులు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అకౌంట్ నందు జమ చేయాలని అన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించవద్దని విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వ్యవస్థ పనితీరులో ఎక్కడ వెనుకబాటు తనం చోటు చేసుకోకూడదని సిబ్బందికి సూచించారు. గ్రామంలో త్వరితగతిన నూరు శాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శికి ప్రత్యేకంగా వివరించారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, గుమస్తా శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.



చొప్పెల్ల పంచాయతీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిపిఒ



గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

వెంకటాయపాలెంలో ఉపాధి హామీపై గ్రామసభ

ప్రజాశక్తి - రామచంద్రపురం

జాతీయ ఉపాధి హామీ చట్టంపై గ్రామసభ మండలంలోని వెంకటాయపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. గ్రామసర్పంచ్ శ్రీమతి యల్లమిల్లి సతీష్ కుమారి అధ్యక్షతన జాతీయ ఉపాధి హామీ చట్టం ప్లానింగ్ పై సర్పంచ్ మాట్లాడారు. గ్రామంలో పెండింగ్లో ఉన్న పనులను దశలవారీగా జాతీయ ఉపాధి హామీ చట్టంలో పూర్తి చేయాలని దీని కోసం పనులను గుర్తించాలని, ఆమె పంచాయతీ అధికారులకు గ్రామంలో చేయాల్సిన పనులను, వివరాలను గ్రామ ప్రజలు, వార్డు సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ లక్ష్మీగణపతిరావు, జెఇ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అరుణ, ఫీల్డ్ అసిస్టెంట్ మణికంఠ, ఉపాధి హామీ లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మౌలానాకు ఘన నివాళి

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు జనాబ్ మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ 138 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా విశేషమైన సేవలు అందించారని అన్నారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం 2025 , మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని ఒకే సమయంలో నిర్వహించుకోవడం మైనా రిటీ జాతి గర్వించదగ్గ పరిణామన్నారు. నవంబర్ 11 న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ముందుగా మౌలానా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యమంలో మైనారిటీ వెల్ఫేర్ రాష్ట్ర సభ్యులు హాజీ ముకరామ్ హుస్సేన్, కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు మహ మ్మద్ బషీర్ హుస్సేన్, నాయకులు మీరాన్ షరీఫ్, మైనారిటీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈ దేశానికి చేసిన సేవలు అజరామరమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం ఎంఎల్ఎ కార్యాలయంలో మంగళవారం మౌలానా జయంతి నిర్వహించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ మౌలానా జయంతిని జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు.

వాడివేడిగా మండల పరిషత్ సమావేశం

- నిధుల కేటాయింపుపై టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం
- వెళ్లిపోయిన వైసిపి ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్లు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ నిధులు కేటాయింపుపై వాడివేడిగా సాగింది. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిపి సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొంథా తుపాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయరని వారందరినీ ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని జడ్పిటిసి సభ్యులు పుట్టపూడి అబ్బు ఎంఎల్ఎ వేగుళ్లను కోరారు. నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఎంఎల్ఎ స్పష్టం చేశారు. గత వైసిపి పాలనలో టిడిపి, జనసేన సర్పంచులుగా గెలిచిన తమ గ్రామాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులో వివక్ష చూపారంటూ కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, కోరుమిల్లి,కాలేరు,అద్దంకి వారి లంక, వల్లూరు, సర్పంచ్ లు ఆచంట సత్యనారాయణ, దాయం కావేరి, నాతి గవరయ్య, దాసి మీనా కుమారి లు పోడియం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వైసిపి గ్రామాల్లో అభివృద్ధి జరక్కుండా తీర్మానాలను ఎంఎల్ఎ అడ్డుకుంటున్నారని పలువురు వైసిపి ఎంపిటిసి సభ్యులు ఆరోపించారు. దీనిపై టిడిపి, వైసిపి సభ్యుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు వాగ్వాదం జరిగింది.

నిధులు 19 గ్రామాలకు సమంగా పంచాలి

వైసిపి జడ్పిటిసి పుట్టపూడి అబ్బు మాట్లాడుతూ వివిధ పథకాల కింద మంజూరైన సుమారు మూడు కోట్ల రూపాయలు నిధులు మండలంలోని 19గ్రామాలకు సమంగా పంచాలని ఎంఎల్ఎని కోరారు. అందుకు పలువురు సభ్యులు అంగీకరించలేదు. గతంలో గ్రామాల అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానాలు చేసి మండల పరిషత్తుకు పంపించిన నిధులను మరలా అన్ని గ్రామాలకు ఎలా పంచతారని పలువురు అధికార పార్టీ సభ్యులు నిలదీశారు. దీనిపై ఎంఎల్ఎ వేగుళ్ల నిధులు ఆమోదం విషయమై వ్యతిరేకించడంలో ఓటింగ్ కు సిఫార్సు చేయగా అందుకు వైసిపి ఎంపీటీసీలు సమ్మతించలేదు.

సమయమిస్తే అందరితో చర్చిస్తా: ఎంపిపి

ఈ విషయమై ఎంపిపి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని నాలుగు రోజుల సమయం ఇస్తే నిధులు విషయమై అందరితో చర్చించి తెలియజేస్తామని చెప్పగా అందుకు పలువురు సభ్యులు అంగీకరించకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వైసిపి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఎంపిడిఒ భానూజీరావును వివరణ కోరగా మెజార్టీ సభ్యులు హాజరు కావడంతో సమావేశం కొనసాగిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, వైస్ ఎంపిపి గుణ్ణం భాను ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న సర్పంచులు

నేరాలు ఘోరాలు

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆర్‌పిఎస్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, జిఆర్‌పి ఎస్ఐ వాసు ఆధ్వర్యంలో ట్రైన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిట్టు కుమార్ యాదవ్ అనే యువకుడి గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి బుధవారం విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

బస్సు చక్రం కింద పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాత్తు బస్సు చక్రం కింద పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వెలిచేరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వెలిచేరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి రాజు, సురేఖ దంపతులకు కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉదయ పవన్ ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌లో ఎల్‌కెజి చదువుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం కుమారుడు పవన్‌ను బస్సు ఎక్కించేందుకు తల్లి సురేఖ రోడ్డు వద్దకు వచ్చింది. ఆమె కుమార్తె హరిణి వరలక్ష్మి తల్లి వెనకాల వచ్చింది. కుమార్తె వచ్చిన విషయం తల్లి గమనించలేదు. కుమారుడు పవన్‌ను బస్సు ఎక్కించడంతో బస్సు ముందుకు కదిలింది. వెనుక వైపు హరిణి ఉన్నట్లు డ్రైవర్ గుర్తించకపోవడంతో బస్సు ఎడమవైపు వెనుక భాగం చక్రం కింద చిన్నారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో చిన్నారి హరిణి అక్కడికక్కడే మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ ఎస్.రాము సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులో తీసుకొని బస్సును పోలీస్ స్టేషన్ తరలించారు. హరిణి తల్లి సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం కోదండ రామాలయం సమీపంలో బైకు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలానికి చెందిన బోణం సూర్యనారాయణ(70) రాజానగరంలో సోదరుడిని చూసేందుకు సోమవారం వచ్చాడు. తిరిగి ఇంటికి నడిచి వెళుతుండగా రావుల చెరువు గట్టు కోదండ రామాలయం సమీపంలో బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ తలకు బలమైన గాయమైంది. వెంటనే అతన్ని రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ జివివి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో లారీ దగ్ధం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలోని ప్రతాప్ నగర్- సామర్లకోట రోడ్డు జెడ్ బ్రిడ్జి సమీపంలో లారీ దగ్ధమైంది. హైదరాబాదు నుంచి కాకినాడకు వెళ్తున్న లారీలో హోర్డింగ్ ఏర్పాటుకు సంబంధించి హైడ్రోజన్ పరికరాలలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మంగళవారం రాత్రి చిరునామాను అడిగేందుకు డ్రైవర్ బషీర్, క్లీనర్ బాలరాజు లారీ నుంచి దిగిన తరువాత ఈ ప్రమాదం జరిగింది. లారీ నుంచి వచ్చిన మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. అయితే అప్పటికే ముందు వెనుక భాగం పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణను అగ్నిమాపక, పోలీస్ అధికారులు చేస్తున్నారు.

కిడ్నాప్‌కు గురైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి - అమలాపురం

అపహరణకు గురైన బాలికను పోలీసులకు రక్షించి ఆమె తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. వివరాలు ఇవి..అమలాపురం పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాల లో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థిని సోమవారం సాయంత్రం అదశ్యమైన ఘటన కలకలం రేపింది. కముజు రమణకు చెందిన కుమార్తె నిషిత(10)ను మేనమామ వరస వ్యక్తి ఐమైండ్స్ స్కూల్ సమీపంలో నుంచి తీసుకెళ్లాడు. అనంతరం కాకినాడ వైపునకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ ఫుటేజీలో రాత్రి 10.13 గంటలకు నిందితుడు తిరిగి తన స్వగ్రామం పి.గన్నవరం వైపు వస్తున్నట్లు నమోదు అయింది. తర్వాత అతడు 20 ఎకరాల అరటి తోటలోకి వెళ్లి అక్కడే దాక్కున్నాడు. సమాచారం అందుకున్న టౌన్ సిఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు రాత్రంతా గాలింపు చేపట్టారు. పి.గన్నవరం మండలం యర్రంశెట్టి వారి పాలెం వద్ద భవానీలు మంగళవారం బాలికను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పాపను రక్షించి తండ్రి కముజు రమణకు అప్పగించారు. నిందితుడు పరారీలో ఉండగా, అతడి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు.

యువజనోత్సవ పోటీలకు సహకారం

ప్రజాశక్తి - అమలాపురం

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వచ్చే జనవరిలో ఢిల్లీలో జరిగే జాతీయ యువజనోత్సవ పోటీలకు తన పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ గంటి హరీష్ మాదుర్ అన్నారు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ కాకినాడ వారు నిర్వహించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజనోత్సవ కార్యక్రమంలో ఎంపీ హరీష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత సవంత్సరం జరిగిన జాతీయ యువజనోత్సవ వేడుకలకు హాజరయ్యానని ఆ వేడుకలలో మన ఎపితో పాటు ఇతర రాష్ట్రాల పేర్లు వినపడ్డాయని కానీ వచ్చే ఈ కార్యక్రమంలో మన రాష్ట్రం తరపున మన మన జిల్లా పేరు ఉండాలని కోరారు. ఈ పోటల్లో రాష్ట్ర స్థాయిలో ఎంపిక అయిన వారు జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో మన అమలాపురం యువత గెలుపొందాలన్నారు. అనంతరం తన నృత్య ప్రదర్శనతో అలరించిన విద్యార్థిని సత్యవతిని సత్కరించారు.

డ్రెయినేజీలు ఇలా.. నడిచేదెలా

16 17 వార్డులో ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలోని 16, 17వ వార్డుల్లో డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో మురికి నీరు రోడ్లపైకి చేరి చెరువులను తలపిస్తున్నాయి. నడిచేందుకు సైతం వీలు లేక ప్రజలు ఇప్పట్లకు గురవుతున్నారు.

పట్టణంలోని 16వ 17వ వార్డుల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డ్రెయినేజీలో నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో రోడ్డు మీదకు పొంగిపొర్లుతూ చెరువుల తయారైంది. దీనితో రాత్రి, పగలు ఈగలు, దోమలతో అవస్థలు పడుతున్నామని ఆయా వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రోజూ మురుగు నీటిలో నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు దీనిపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారుల కు విజ్ఞప్తి చేసిన ఫలితం లేదన్నారు. ఐదు రోజుల క్రితం డ్రెయినేజీ లైన్ వేస్తామని పని మొదలు పెట్టి మధ్యలోనే ఆపివేయడంతో నీటి ప్రవాహం పూర్తిగా బ్లాక్ అయి, డ్రెయినేజీ నీరు రోడ్డు మీద నిలువ ఉండిపోతోంది. దాదాపు 20 అడుగుల మేర రహదారి మొత్తం మురికి నీటితో నిండిపోయింది. ఈ ప్రాంతం జనసాంద్రత ఎక్కువగా ఉండడమే కాకుండా, దగ్గర్లోని అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉండటం, పాదచారులు యాత్రికులు మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంతం ముచ్చుమిల్లి రోడ్డు నుండి వెంటూరు వైపు వెళ్లే మెయిన్ రోడ్డుకు అనుసంధానంగా ఉండటంతో ఇక్కడ రోజూ వందలాది వాహనాలు వెళ్ళే రహదారి. డ్రెయినేజీ రు నిల్వ కావడంతో పలు వాహనాలు, బైక్‌లు, ఆటోలు జారిపడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి . ఇప్పటికే ఆ ప్రాంతంలో వాహనాలు జారిపడి పలువురు గాయాలపలయ్యారని వార్డు ప్రజలు తెలుపుతున్నారు. దీనిపై మున్సిపాలిటీ అధికారులు మాత్రం మౌనం వీడడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ పనులు మధ్యలో వదిలివేయడంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం మున్సిపాలిటీ నిర్లక్ష్యం అని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై వెంటనే రోడ్డు శుభ్రం చేసి, డ్రెయినేజీ లైన్ పూర్తి చేయాలని లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు. ఈ ప్రాంతం రామచంద్రపురం పట్టణం మధ్యలో ఉండటం వల్ల . తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు మున్సిపాలిటీకి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుపైకి చేరిన మురుగనీరు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - రావులపాలెం



చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అర్హుల ందరికీ సిఎం సహాయనిధి అందుతోందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఆత్రేయపురం మండలానికి చెందిన 13మందికి రూ.5,26,868 రావులపాలెం మండలానికి చెందిన 7గురికి రూ.2,61,363, కొత్తపేట మండలానికి చెందిన 9మందికి రూ.5,16,619, ఆలమూరు మండలానికి చెందిన 8మందికి రూ.4,53,154 మొత్తం 37మందికి (34 రీయింబర్స్మెంట్, 3 ఎల్ఒసిలు) రూ.17,58,004ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, ఈదల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'గన్నవరపు' వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

కూటమి శ్రేణుల డిమాండ్

ప్రజాశక్తి - పి.గన్నవరం



పి.గన్నవరంలో మాట్లాడుతున్న కూటమి శ్రేణులు

వైసిపి కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ పి.గన్నవరం ఎంఎల్ఎపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని కూటమి శ్రేణులు డిమాండ్ చేశారు. పి.గన్నవరంలో ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం కూటమి నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. అందరూ సమానమే కులం, మతం పార్టీ చూడకుండా సేవా భావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణపై నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని కూటమి నాయకులు అన్నారు. సిఎంఆర్‌ఎఫ్ విషయంలో సేవాభావం గల ప్రజా ప్రతినిధిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం శ్రీనివాస్ అవివేకానికి, రాజకీయ దిగజారుతనానికి నిదర్శనమని కూటమి నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎంఎల్ఎని అవమానించే ప్రయత్నాన్ని మేము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని రేపటి నుంచి శ్రీనివాస్ చేపట్టే ఏ కార్యక్రమమైనా కూటమి నాయకులు తరుపున అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగరం ఎఎంసి ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, ఎస్.వెంకట సత్యనారాయణ (జెడి), వాసంశెట్టి కుమార్, పడాల సూపర్, కొర్లపాటి ఢిల్లీ, అరిగెల సూరిబాబు,ఎన్డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'వైసివి శ్రేణలకు బుద్ధి చెబుతాం'

ప్రజాశక్తి - అంబాజీపేట



అంబాజీపేటలో కూటమి శ్రేణుల నిరసన

పి.గన్నవరం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఎంఎల్ఎపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ తగిన రీతిలో వైసిపి శ్రేణులకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని అంబాజీపేట మండల కూటమి శ్రేణులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.కూటమి ప్రభుత్వం, ఎంఎల్ఎపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గన్నవరపు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూటమి సమావేశం డిమాండ్ చేసింది. వైసిపి శ్రేణులు తలపెట్టిన బైక్ ర్యాలీని అడ్డు కుంటామని కోఆర్డినేటర్ గన్నవరపును నియోజకవర్గంలో ఎక్కడా తిరగనియ్యమని కూటమి శ్రేణుల సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు,కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, కొర్లపాటి వెంకటేశ్వర రావు, గూడాల ఫణి, రవణం రాము, పెదపూడి శ్రీనివాసరావు, సుంకర గణపతిరావు, అల్లాడ సూర్యనారాయణమూర్తి, కత్తుల బాబులు,వాకపల్లి దొరబాబు, గంగుమళ్ళ వీరభద్రరావు, దొమ్మేటి సాయికృష్ణ, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్రివాని రేవులో 'కోటి సంతకాల సేకరణ'

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని కర్రివాని రేవు పంచాయతీ పరిధిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాలు సేకరణ చేపట్టింది. మంగళవారం గ్రామంలో 'రచ్చబండ' కార్యక్ర మంలో మాజీ ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు చెల్లిబోయిన శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో విద్య,వైద్యను పేదలకు అందకుండా చేయడానికి కూటమి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికే వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో వైసిపి కేంద్ర కార్యవర్గ సభ్యుడు పితాని బాలకృష్ణ, సర్పంచ్ కాశి భాగ్యలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కాశి మునికుమారి, జడ్‌పిటిసి సభ్యుడు కుడిపూడి శివ శంకర రావు, పెయ్యిల చిట్టిబాబు, కోలా బాబ్జి, మట్టపర్తి సురేష్, కాశి వెంకటరమణ, జగత బాబ్జి, చింతా నాగమునీంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న కె.మాధవీలత

టీచ్ టూల్ శిక్షణతో మెరుగైన బోధన

ప్రజాశక్తి- కొత్తపేట

టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమం ద్వారా బోధనా నైపుణ్యాలు పెంపొందుతాయని రాష్ట్ర పరిశీలకురాలు కె.మాధవీలత అన్నారు. డివిజన్ స్థాయి టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని కొత్తపేట ఎంఇఒ-2 కె. లీలావతి పర్యవేక్షణలో కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10, 11 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు పెంపొందడానికి నిర్దేశించిన ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్‌లో పరిధిలోని అయినవిల్లి, ఆలమూరు, అంబాజీపేట, ఆత్రేయపురం, కొత్తపేట, పి.గన్నవరం, రావులపాలెం మండలాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఆయా మండలాలకు సంబంధించిన టీచర్ అబ్జర్వర్స్ 146 మంది, మాస్టర్ ఫెసిలిటేటర్‌గా 14 మంది పాల్గొన్నారు. స్టేట్ అబ్జర్వర్ కె.మాధవిలత , జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించి ఉపాధ్యా యులకు బోధనపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కొత్తపేట మండల విద్యాశాఖాధికారి యం.హరిప్రసాద్ పలు సూచనలు చేశారు. జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ జి. మమ్మీ, జిల్లా కమ్యూనిటీ మొబలైజ్ ఆఫీసర్ బొరుసు సుబ్రమణ్యం, కొత్తపేట, రామచంద్రాపురం డివిజనల్ అధికారి పి.రామలక్ష్మణ మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పత్రి పూజ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో శ్రీ పార్వతీ సమేత అగస్తేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ఘనంగా లక్షపత్రి పూజ నిర్వహించారు. అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. వై.పకిరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పలువురు వేద పండితులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో యాత్రికులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు కృషి చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

యువతలో ఆత్మవిశ్వాసం పెంచడం, స్వావలంబన కోసం ప్రేరేపించడం వంటి శిక్షణలో ద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసు కుని గ్రామీణ ఆర్థికాభివద్ధి, ఆర్థిక వ్యవస్థ పురోగతికి బ్యాంకర్లు కృషిచేయాలి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎర్రమిల్లి వారి వీధిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ నిరుద్యోగ యువత 18-45 ఏళ్ల వయస్సుకు ఉచిత, వసతి, భోజనం లాంటి సదుపాయాలతో సహా నైపుణ్య శిక్షణలు పూర్తి స్థాయిలో అందించి తదుపరి బ్యాంకు రుణాలు పరపతితో జీవనోపాదులను పెంపొందించాలన్నారు. యువతలో స్వయం ఉపాధికి అనువైన వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం, ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జవసత్వా లు తీసుకురావాలన్నారు. శిక్షణ అనం తరం అభ్యర్థులకు స్వయం ఉపాధి ప్రారంభించేందుకు బ్యాంకు రుణ సౌకర్యాలు కల్పిస్తూ మానిటరింగ్ చేస్తూ జీవన ప్రమాణాలు మెరుగు పరచాలన్నారు. శిక్షణ తర్వాత కనీసం రెండు సంవత్సరాల పాటు మైక్రో ఎంటర్ప్రైజ్ స్థిరీకర రణకు మద్దతు, బ్యాంకు రుణ ప్రక్రియలలో సహా యం అందించాలన్నారు. ఈ సంస్థ గ్రామీణ ప్రాంతా ల్లో యువతకు స్వయం ఉపాధి దిశగా దారితీసే ప్రధాన వేదికగా పనిచేస్తూ, వివిధ వృత్తులపై ప్రాక్టికల్ శిక్షణలతో వారి జీవనోపాదులు పెంపుదలకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీ య మేనేజర్ బిజిఆర్.నాయుడు, సెంటర్ డైరెక్టర్ రమ్య, నాబార్డ్ డిడిఎం స్వామి నాయుడు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవ వర్మ, మెప్మా పీడీ డిఆర్‌డిఎ డిపిఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌కు సిమెంట్ బల్లల బహూకరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌కు ప్రయాణికులు సౌకర్యార్థం 14 సిమెంట్ బల్లలను ద్రాక్షారామ శ్రీ భక్తాంజనేయ రుచి అభిరుచి స్వీట్స్ స్టాల్ యజమాని చోడిశెట్టి వీరభద్రరావు మంగళవారం బహూకరించారు. ఆయన తండ్రి చోడిశెట్టి నాగేశ్వరరావు సోదరుడు ప్రకాష్‌రావు జ్ఞాపకార్థం వీటిని అందజేశారు. వీటి విలువ సుమారు రు 70, వేలు ఉంటుందని డిపో మేనేజర్ పేపకాయల భాస్కర్ రావు తెలియజేశారు. ఆర్‌టిసి పట్ల వీరభద్ర రావు అభిమానానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



హుండీల లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

బాల బాలాజీ హుండీ ఆదాయం రూ.42.90 లక్షలు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ హుండీ ఆదాయం రూ.42,90,035లు ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో మంగళవారం హుండిల లెక్కింపు జరిగింది. 73 రోజులకు ఆలయ ప్రధాన హుండీల నుండి నగదు రూ.42,57,068,అన్నప్రసాదం హుండీ నుంచి నగదు రూ.32,967 వెరసి మొత్తం రూ.42,90,035 ఆదాయం వచ్చిందని, బంగారం 4 గ్రాములు, వెండి 35 గ్రాములు సమాకూరిందన్నారు. ఈ లెక్కింపులో అర్చక స్వాములు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది,బ్యాంక్ ఆఫ్ బరోడా, అప్పనపల్లి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఊబలంక విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - రావులపాలెం

ఇటీవల విజయవాడ స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అండర్ -17 విభాగంలో ఎస్‌విజి.స్కూల్ విద్యార్థి కొప్పిశెట్టి శశాంక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థి శశాంక్ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ బైర్రాజు శ్రీనివాసరాజు, స్కూలు డైరెక్టర్ రామకృష్ణ, కరస్పాండెంట్ వి.జగపతి రాజు అభినందించారు. వీరు మహారాష్ట్ర లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పిఇటి.ప్రసాద్ తెలియజేశారు

మాజీ మంత్రి గొల్లపల్లికి పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గుండె సంబంధిత సమస్యతో అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి సూర్యారావు ను మంగళవారం సన్నవిల్లికి చెందిన ఎంపిటిసి సభ్యురాలు, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజా కుమారి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గొల్లపల్లి సూర్యారావును పరామర్శించిన వారిలో వైసిపి మండల కార్యదర్శి పినిపే జయరాజ్, నాయకులు భోగిశెట్టి నర్సింగ్ తదితరులు ఉన్నారు.

కుందూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం కుందూరు గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, వ్యవసాయ శాఖ ఎడిఎ నాగ కుమార్ హాజరయ్యారు .ఈ సందర్భంగా సలాది రమేష్ రైతులకు మద్దతు ధర ఇప్పించేందుకు ఎల్లప్పుడూ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పంపన నాగమణి, తెలుగు రైతు అధ్యక్షుడు బలుసు శివ ప్రసాద్, కుందూరు సొసైటీ ప్రెసిడెంట్ జగతా వెంకట రమణ, మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మోడరన్ హ్యూమానిటీ క్లబ్ 31వ యూనిట్ ఛైర్మన్‌గా సూర్య సత్తిబాబు

ప్రజాశక్తి - రామచంద్రపురం



సత్తిబాబు దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన జివి.రావు

రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు యూనివర్సల్ సింగిల్ ఫ్యామిలీ భావనతో మోడరన్ హ్యూమా నిటీ క్లబ్ ప్రారంభించ నున్నారు. దీనిలో భాగంగా జివి. రావు ఈ నెల 11న ద్రాక్షారామం సూర్య విద్యాసంస్థల భాగస్వామి దొడ్డ సత్తిబాబు, సూర్యకుమారి దంపతులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోడరన్ హ్యూమానిటీ క్లబ్ కి సంబంధించిన ప్రతిపాదనను సత్తిబాబుకు జివి.రావు తెలియజేసారు.హ్యూమానిటీ క్లబ్ యూనిట్స్ 31వ ఛైర్మన్‌గా సూర్య సత్తిబాబును జివి.రావు సాదరంగా ఆహ్వానించారు. తన ప్రతిపాదనకు సత్తిబాబు సానుకూలంగా స్పందించినట్లు జివి.రావు అన్నారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా మరింత విస్తృతం చేస్తూ ప్రణాళికబద్ధంగా ముందుకు అడుగులు వేస్తున్నట్లు జివి.రావు పేర్కొన్నారు. "ఆకలి లేని సమాజం" అనే ఆశయ సాధనతో తాను తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ స్వాగతించి మద్దతుగా నిలుస్తారని జి.వి.రావు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

న్యాయవాదుల రక్షణకు చట్టాన్ని తీసుకురావాలని ముమ్మిడివరం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఇటీవల న్యాయవాదులుపై దాడులను ఖండిస్తూ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ పుత్తూరు కోర్టు ఆవరణలోనే న్యాయ వాదులపై దాడులు చేస్తుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు .న్యాయవాదుల రక్షణకై వెంటనే చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన లో బార్ సెక్రటరి మట్టపర్తి వెంకటేశ్వరరావు, దోనిపాటి ఆంజనేయులు, కుచ్చర్లపాటి తాతం రాజు, గ్రంధి వెంకట రామారావు, కెఎల్‌వి.ప్రసాద్, పై నరేష్, కె.అఖిల్, ఎం.రమ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో స్వమిత్వ గ్రామసభ

ప్రజాశక్తి - రామచంద్రపురం

హసన్‌బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు అధ్యక్షతన స్వమిత్వ ప్రత్యేక గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపిడిఒ ఎం.శివ ప్రసాద్ హాజరై స్వమిత్వ పై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో స్వమిత్వ సర్వే జరిగిందని సర్వేలో ఏమైనా లోపాలుంటే సరి చేసుకొనుటకు ఈ గ్రామసభ నిర్వహించామన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామకంఠంలో ఉన్న నివేశిత స్థలంలో ఉన్న భూమికి పిపిఎం. నెంబర్ ఇస్తారని ఇది మీ ఆస్తికి భవిష్యత్లో రక్షణగా ఉంటుందని సర్పంచ్ గ్రామస్తులకు తెలిజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, పిఎసిఎస్ డైరెక్టర్ చోడిశెట్టి వీరభద్రరావు, గ్రామ ఉప సర్పంచ్ నీలం భవానీ, వార్డు సభ్యులు చోడిశెట్టి పాండురంగారావు, గొల్ల పళ్ళపద్మ రాజు, పంచాయతీ కార్యదర్శి సబ్బెల్ల ప్రసాద్ రెడ్డి, విఆర్ఒ నరహరశెట్టి సత్తిబాబు, సచివాలయం రెవిన్యూ, అంగన్‌వాడీ ,డ్వాక్రా, ఆరోగ్య సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఈనెల 26న హలో మాల - చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని ఆంధ్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు సిద్ధాంతుల కొండబాబు అన్నారు. మంగళవారం మండలంలోని జొన్నాడలో ఆంధ్ర మాల మహానాడు జిల్లా కార్యదర్శి దడాల చంద్రరావు, మాల మహానాడు మండల ఉపాధ్యక్షులు గంటా మనోహర్ దాస్ ఆధ్వర్యంలో హలో మాల చలో ఢిల్లీ రాజ్యాంగ హక్కుల సాధన సభ కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు బోణీ సంజయ్ కుమార్, వాడే సురేంద్ర, బోణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కేన్సర్ క్యాంప్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మండపంలో బుధవారం అంకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ దీప్తి ఆధ్వర్యంలో ప్రముఖ నిపుణులతో ఉచిత కేన్సర్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు గాదిరాజు ప్రసాద్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రెండు రోజులు పాటు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.